


ఆదివారం 26 జూలై 2026 పేజీలు : 8

# విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

-హక్కులు,విధులపై జడ్జి హిమబిందు అవగాహన



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25:** విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, హక్కులు, విధులపై నారాయణఖేడ్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి హిమబిందు అన్నారు. శనివారం నారాయణఖేడ్ నియోజకవర్గం సిర్గాపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాల మరియు పొట్ పల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో న్యాయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎం. హిమబిందు మాట్లాడుతూ.. విద్యార్థులు తమ హక్కులతో పాటు విధుల - మిగతా3లో

# ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

అమీన్ పూర్ లో రూ.80 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రథమ ప్రాధాన్యత



**అమీన్ పూర్(ప్రజాజ్యోతి)** అమీన్ పూర్ పరిధిలోని ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం అమీన్ పూర్ డివిజన్‌లోని ఆర్ఆర్ హోమ్స్, ఎస్ఎస్ అపార్ట్‌మెంట్, దుర్గా హోమ్స్ కాలనీలలో రూ.80 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో - మిగతా3లో

# ప్రభుత్వ భూమి కబ్జా నిజమే

స్థానికుల ఫిర్యాదులతో కదిలిన రెవిన్యూ యంత్రాంగం.

అమీన్ పూర్ 783 ప్రభుత్వ భూమిని సర్వే చేసిన అధికారులు.

767 సర్వే నెంబర్ లో నిర్మిస్తున్న నిర్మాణదారుడు కబ్జాకు ప్రయత్నం... మరో 3 గుంటలూ ప్రభుత్వ ఖాతాలోకి

శంభుని గుడి పక్కన సర్వే నంబర్ 783 ప్రభుత్వ భూమి హద్దుల గుర్తింపు

ప్రభుత్వ భూమేనని ప్రాథమిక నిర్ధారణ..  హైడ్రాకు నివేదిక పంపనున్న తహశీల్దార్

ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవన్న అధికారులు





అమీన్ పూర్(ప్రజాజ్యోతి) అమీన్ పూర్ మండలంలోని బీరంగూడలో విలువైన ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు ముమ్మరం చేశారు ఇప్పటికే 142 గజాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న అధికారులు, తాజాగా మరో మూడు గుంటల భూమిపై సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిగానే గుర్తించారు. ఈ భూమిలో ఎలాంటి ఆక్రమణలు, నిర్మాణాలు చేపట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ వెంకటేష్ హెచ్చరించారు. అమీన్పూర్ మండలం బీరంగూడ పరిధిలోని శంభుని గుడి సమీపంలోని సర్వే నంబర్ 783లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ చర్యలు వేగవంతమయ్యాయి. పక్షం రోజుల క్రితం 765 సర్వే నంబర్‌లో 142 గజాల ప్రభుత్వ భూమిని హైడ్రా, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా స్వాధీనం చేసుకుని కంచె ఏర్పాటు చేశారు. తాజాగా స్థానికులు ఫిర్యాదు చేయడంతో శనివారం తహశీల్దార్ వెంకటేష్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. - మిగతా3లో

# పిల్లల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం






జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జి. భవానీ చంద్ర

ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ వ్యవస్థను పటిష్టం చేయాలి -- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

నాల్సా స్కీం--2024 కింద చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు సెన్సిటైజేషన్ కార్యక్రమం

**సంగారెడ్డి ప్రజా జ్యోతి జూలై 25:-** పిల్లల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర అన్నారు. జాతీయ న్యాయ సేవా సంస్థ రూపొందించిన చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ స్కీమ్ --2024" మరియు తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖతో కుదిరిన అవగాహన ఒప్పందం అమలులో భాగంగా, సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నియమితులైన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు ఒక రోజు సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో, జిల్లా విద్యాశాఖ సమన్వయంతో కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్‌పర్సన్ జి. భవానీ చంద్ర మరియు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని 239 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 239 మంది ఉపాధ్యాయులను చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియమించినట్లు ఈ సందర్భంగా తెలిపారు. వీరికి పిల్లల రక్షణ, హక్కుల పరిరక్షణ, పాఠశాల స్థాయిలో బాలల సమస్యలను గుర్తించడం, చట్టపరమైన రక్షణ కల్పించడం, సంబంధిత శాఖలతో సమన్వయం వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానీ చంద్ర మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి సురక్షితమైన, భయ,హింస రహితమైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తూ, వారి ప్రవర్తనలో వచ్చే మార్పులను నిశితంగా గమనించాలని సూచించారు. బాలలపై జరిగే వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, మాదకద్రవ్యాల ప్రభావం, పోక్సో చట్టం, సైబర్ నేరాలు వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండి, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

పిల్లల రక్షణను అదనపు బాధ్యతగా కాకుండా సమాజానికి చేసే గొప్ప సేవగా భావించాలని ఆమె సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు సమర్థవంతంగా పనిచేస్తే బాలల రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. పిల్లలతో స్నేహపూర్వక వాతావరణాన్ని ఏర్పరచి వారి నమ్మకాన్ని పొందాలని, గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, మానసిక ఆరోగ్యం, బాలల హక్కులు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు వంటి అంశాలపై నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, ప్రవర్తనా మార్పులను ప్రారంభ దశలోనే గుర్తించి తల్లిదండ్రులు, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అదనపు పోలీసు సూపరింటెండెంట్ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, బాలల భద్రతకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఉపాధ్యాయులు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పిల్లలపై జరిగే నేరాలు, పోక్సో చట్టం, సైబర్ నేరాలు, సోషల్ మీడియా దుర్వినియోగం వంటి అంశాలపై విద్యార్థులకు నిరంతరం అవగాహన కల్పించాలని, పిల్లలు లేదా తల్లిదండ్రులు భయంతో సమస్యలను బయటపెట్టలేని సందర్భాల్లో ఉపాధ్యాయులే ముందుకు వచ్చి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ, చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ టు చిల్డ్రన్ స్కీం 2024 లక్ష్యాలను వివరించారు. పాఠశాల స్థాయిలో పిల్లల సమస్యలను గుర్తించి, అవసరమైన సందర్భాల్లో జిల్లా న్యాయ సేవా సంస్థతో సమన్వయం చేసుకుని బాధిత బాలలకు ఉచిత న్యాయ సహాయం, కౌన్సెలింగ్, రక్షణ చర్యలు అందేలా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీలేఖ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డి.వి.ఆర్. తేజో కార్తీక్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. ధనలక్ష్మి పాల్గొని పోక్సోచట్టాలు, బాలల హక్కులు, పాఠశాలల్లో చైల్డ్ ప్రొటెక్షన్ మెకానిజం, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారుల బాధ్యతలు, బాలలపై వేధింపులను గుర్తించడం, బాలలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. సంజీవ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రాజారెడ్డి, వివిధ శాఖల అధికారులు, జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి నియమితులైన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు (ఉపాధ్యాయులు), తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

గురించి తెలుసుకోవడం ఎంతో అవసరమని అన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు.

బాలల రక్షణ చట్టాలు,మహిళల భద్రత,విద్యార్థుల హక్కులు,ఉచిత న్యాయ సహాయం పొందే మార్గాలపై సులభంగా వివరించారు. చట్టాలపై అవగాహన ఉండటం వల్ల నేరాలకు దూరంగా ఉండటంతో పాటు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగవచ్చని తెలిపారు.



విద్యతో పాటు క్రమశిక్షణ,నైతిక విలువలను అలవరుచుకుని ఆదర్శ పౌరులుగా ఎదగాలని సూచించారు. ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు.

అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, సిబ్బంది,సిర్గాపూర్ ఎస్ఐ,పోలీసు సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25:** కంగ్టి మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల టీడబ్ల్యూఆర్‌జేసీను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే తరగతి గదులు, విద్యార్థుల వసతి, భోజన సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న విద్య, భోజనం, హాస్టల్ సౌకర్యాలు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే కళాశాల ఉపాధ్యాయులతో సమావేశమై విద్యా బోధన, మౌలిక వసతులు, కళాశాల ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి కబ్జా నిజమే

-మొదటిపేజీ తరువాయి

సర్వేయర్‌తో కలిసి భూమి హద్దులను గుర్తించి సర్వే నిర్వహించిన అధికారులు, ఆ స్థలం కూడా ప్రభుత్వ భూమేనని ప్రాథమికంగా నిర్ధారించారు. దీనికి సంబంధించిన పూర్తి నివేదికను హైడ్రా అధికారులకు పంపించి తదుపరి చర్యలు చేపడతామని తహశీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ భూములపై ఎలాంటి ఆక్రమణలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టినా, కబ్జాకు పాల్పడినా సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్మాణ యజమానులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టే ప్రయత్నం చేస్తే చట్టం తన పని తాను చేస్తుందని పేర్కొన్నారు. ఎంతటి వారైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. స్వాధీనం చేసుకుంటున్న విలువైన ప్రభుత్వ భూములను భవిష్యత్తులో ప్రజా అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ భూములను ప్రభుత్వ అవసరాలకు కేటాయిస్తామని వెల్లడించారు.

ఈ సర్వే కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కంగ్టి ఎంపీడీఓ సత్యయ్యకు సన్మానం

## - అభినందన వీడ్కోలు సభలో పాల్గొన్న ఎమ్మెల్యే








**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25:** కంగ్టి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంపీడీఓ విశిష్ట సేవలందించి, ఉప ప్రధాన కార్యనిర్వహణాధికారిగా డిప్యూటీ సీఈవో పదోన్నతి పొందిన ఎం. సత్యయ్యకు కంగ్టి మండల కేంద్రంలో ఘనంగా అభినందన-- వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సత్యయ్యను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ..కంగ్టి మండలంలో ఎంపీడీఓగా సత్యయ్య ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆయన సేవా తత్పరత, పాలనా నైపుణ్యం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఉప ప్రధాన కార్యనిర్వహణాధికారిగా పదోన్నతి పొందడం ఆనందదాయకమని, కొత్త బాధ్యతల్లోనూ అదే నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, స్థానిక ప్రజలు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



-ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25:** నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల కేంద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.28.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు శనివారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనుల్లో భవనాల మరమ్మతులు, విద్యుత్ సదుపాయాల మెరుగుదల, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య వ్యవస్థ అభివృద్ధి వంటి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇవి పూర్తయితే విద్యార్థులు మరింత సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, నాణ్యమైన విద్య అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యాభివృద్ధే సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, సంబంధిత శాఖ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీమన్నారాయణ హోమం..!

ప్రారంభమైన గురుపౌర్ణమి ఉత్సవాలు

గురు చరిత్ర పారాయణంలో భక్తులు



**జహీరాబాద్, జూలై 25 (ప్రజా జ్యోతి న్యూస్)** జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఈ నెల 29న జరగనున్న వ్యాసపౌర్ణమి (గురు పౌర్ణమి) ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ గణపతి పూజ, గోపూజ, గురు చరిత్ర పారాయణం నిర్వహిస్తున్నారు. శనివారం తొలి ఏకాదశి సందర్భంగా ఆశ్రమంలో వైభవంగా శ్రీమన్నా నరాయణ హోమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, నవగ్రహ పూజ, అగ్ని ప్రతిష్ఠ, సంకల్పం తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వ హించారు. అనంతరం యజ్ఞగుండంలో నెయ్యి, సమిధలు, నవధాన్యాలు, ఔషధ ద్రవ్యాలను సమర్పిస్తూ "ఓం నమో నారా యణాయ" మంత్రోచ్చారణల మధ్య శ్రీమన్నారాయణ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, మహా మండలేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థుల వేదఘోషలు, మంగళవాయి ద్యాల నడుమ పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆనందగిరి స్వామి, నందిని గిరి స్వామి, అర్చకులు శ్రీపాద్ స్వామి, నాగేంద్రయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు, ఆశ్రమ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వంద శాతం ఎస్.ఐ.ఆర్. (సర్ )పూర్తి.. తహాశీల్దార్‌కు ఐకేపీ అధికారుల సిబ్బంది చే సన్మానం.

**కల్హేర్, జూలై 25:ప్రజా జ్యోతి** కల్హేర్ మండలంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను 100 శాతం విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా తహాశీల్దార్ శివ శ్రీనివాస్‌ను ఐకేపీ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐకేపీ సిబ్బంది తహాశీల్దార్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అధికారుల సమన్వయం, క్షేత్రస్థాయి సిబ్బంది అంకితభావంతో పనిచేయడం వల్లే ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో 100 శాతం పూర్తి చేయడం సాధ్యమైందని తహాశీల్దార్ శివ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి అధికారికి, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వంశీకృష్ణ, ఐకేపీ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రాధిక, సమత, బేబి, కల్పన, శోభన్‌తో పాటు పలువురు ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇస్నాపూర్‌లో మౌలిక వసతులు మెరుగుపర్చాలి

### మున్సిపల్ కమిషనర్‌కు మెట్టు శ్రీధర్ వినతి



పటాన్ చెరు(ప్రజాజ్యోతి) ఇస్నాపూర్ మున్సిపాలిటీని పరిశుభ్రమైన, హరిత, ఆధునిక మున్సిపాలిటీగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన కమిషనర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక ప్రాంతాల్లో ఇంటి నంబర్ ల కేటాయింపులో అస్పష్టత, పునరావృత నంబర్ లు, లేకపోవడం వంటి సమస్యల వల్ల ప్రజలు ఆస్తి పన్ను చెల్లింపులు, విద్యుత్, తాగునీటి కనెక్షన్ లు, బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రత్యేక సర్వే నిర్వహించి ఇంటి నంబర్ లు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ప్రతి వార్డులో క్రమబద్ధమైన చెత్త సేకరణ, మొక్కల పెంపకం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఇస్నాపూర్‌ను ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని సూచించారు. అనేక కాలనీల్లో సీసీ రోడ్లు, సమగ్ర డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ముఖ్యంగా వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అవసరమైన ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. కొత్త కాలనీలు, కొత్తగా నిర్మించిన ఇళ్లకు తాగునీటి కనెక్షన్లు అందుబాటులో లేని ప్రాంతాలను గుర్తించి పైప్‌లైన్ విస్తరణ చేపట్టి ప్రతి అర్హత కుటుంబానికి తాగునీటి కనెక్షన్ లు మంజూరు చేయాలని కోరారు. పిల్లలు, మహిళలు, యువత, వృద్ధుల కోసం ప్రతి వార్డు లేదా కాలనీలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని మెట్టు శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలపై పనిభారం పర్వతం...

**సంక్షేమం కంటే సర్వేలకే ఎక్కువ సమయం!**

**చిన్నారుల భవిష్యత్తుకు వెన్నుదన్నుగా నిలిచే టీచర్లు...**

**అదనపు విధులతో సతమతం...**




కొండాపూర్, ప్రజా జ్యోతి జూలై 25: గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల పోషణ, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు కీలకంగా పనిచేసే అంగన్వాడీ టీచర్లు ప్రస్తుతం అసలు విధుల కంటే అదనపు ప్రభుత్వ పనులతో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. పిల్లల అభివృద్ధి కోసం కేటాయించాల్సిన సమయం రోజురోజుకూ తగ్గిపోతుండగా, సర్వేలు, ఆన్‌లైన్ నమోదు, ఎన్నికల విధులు, వివిధ శాఖల పనులతో వారి దినచర్య పూర్తిగా మారిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ-స్కూల్ విద్య బోధించడం, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య వివరాలు నమోదు చేయడం, బరువు, ఎత్తు కొలవడం, పోషకాహారం పంపిణీ చేయడం వంటి బాధ్యతలు ఇప్పటికే విస్తృతంగా ఉన్నాయి. వీటితో పాటు ఇంటింటి సర్వేలు నిర్వహించడం, మొబైల్ యాప్‌లలో సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, వివిధ శాఖల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల వివరాల సేకరణ వంటి పనులు కూడా వారికి అప్పగించబడుతున్నాయి.

ఇటీవల బీఎల్ఓ (బూత్ లెవల్ ఆఫీసర్) విధులు, ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటరు జాబితా సర్వే పనులు కూడా అంగన్వాడీ సిబ్బందికే అప్పగించడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి సమాచారం సేకరించడం, నిర్ణీత గడువులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, తరచూ జరిగే సమీక్ష సమావేశాలకు హాజరుకావడం వంటి పనులతో సెలవులు కూడా లేకుండా పనిచేయాల్సి వస్తోందని వారు వాపోతున్నారు.

"సంక్షేమం కంటే సర్వేలకే ఎక్కువ సమయం"

చిన్నారుల విద్య, పోషణ, ఆరోగ్యంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో సర్వేలు, డేటా ఎంట్రీలు, వివిధ శాఖల పనుల్లోనే ఎక్కువ సమయం గడిచిపోతోందని అంగన్వాడీ టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ వేతనం, అధిక బాధ్యతలు, నిరంతర ఆన్‌లైన్ పనులు, సమావేశాలు, ఎన్నికల విధులు... ఇలా ప్రతి శాఖ పనిని అంగన్వాడీ సిబ్బందిపైనే మోపడం వల్ల సేవల నాణ్యతపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.

## బెల్లాపూర్‌లో పేదల ఇళ్ల కూల్చివేతపై మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆగ్రహం



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 25:** మనూర్ మండలం బెల్లాపూర్ గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు చట్టబద్ధంగా కేటాయించిన ఇంటి స్థలాల్లో నిర్మించుకున్న నివాస గృహాలను కూల్చివేయడం దురదృష్టకరమని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి విమర్శించారు. శనివారం బాధితులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో అర్హులైన పేదలకు ఇంటి స్థలాలను కేటాయించి ధ్రువపత్రాలు అందజేశామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బుల్డోజర్లతో ఇళ్లను కూల్చివేయడం అన్యాయమని ఆరోపించారు. దీంతో నిరుపేదలు నివాసం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సింది పోయి, ఇప్పటికే నివసిస్తున్న వారి గృహాలను నేలమట్టం చేయడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఈ చర్యలను వెంటనే నిలిపివేసి, అర్హులైన బాధితులకు ఇందిరమ్మ గృహ పథకం ద్వారా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అనంతరం బాధితుల తరపున మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందజేసి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబాలతో పాటు బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బి. నగేష్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నూతన కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అమీన్ పూర్ లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పైప్‌లైన్ విస్తరణ పనులు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రతి కాలనీలో మౌలిక వసతులను కల్పించి, అమీన్ పూర్ ను ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు పాల్గొని.. తమ వివరాలను నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. స్థానికంగా నమోదు చేసుకునే ప్రతి ఓటు అభివృద్ధికి పునాది లాంటిదని తెలిపారు. పటాన్ చెరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు చంద్రకళ గోపాల్, కృష్ణ, ప్రమోద్ రెడ్డి, జగదీష్, రాజు, చంద్రశేఖర్, రుశ్వంత్ రెడ్డి, దాసు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## గుంతలమయంగా మారిన కల్హేర్--మాసనపల్లి రహదారి

### నరకానికి తొలి మెట్టుగా మారిన దుస్థితి



**కల్హేర్, జూలై 25:ప్రజా జ్యోతి** సంగారెడ్డి జిల్లా లోని కల్హేర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి మాసనపల్లి మీదుగా మార్డి, పిట్లం వైపు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పరిస్థితి "నరకానికి తొలి మెట్టు"ను తలపించేలా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిరోజూ ఈ మార్గంలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, గుంతలను తప్పించుకునే క్రమంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, విద్యార్థులు, రైతులు, అత్యవసర సేవల కోసం ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు అంచనా వేయలేక ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్హేర్--మాసనపల్లి--మార్డి--పిట్లం రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# నీట్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలి

## కేంద్రం విద్యార్థులకు న్యాయం చేయాలి: కాంగ్రెస్ నేత శివరాజ్

**అందోల్, (ప్రజాజ్యోతి):** నీట్ పేపర్ లీక్ వ్యవహారంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ ఘటనతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని కాంగ్రెస్ పార్టీ అందోల్ మండల అధ్యక్షుడు శివరాజ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జోగిపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు న్యాయం కోసం శాంతియుతంగా పోరాడుతుంటే వారిపై కేసులు నమోదు చేయడం, నిర్బంధాలకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల ఉద్యమానికి దేశవ్యాప్తంగా పార్టీలకు అతీతంగా మద్దతు లభిస్తోందని పేర్కొన్న ఆయన, కేంద్ర ప్రభుత్వం నిర్బంధ ధోరణిని వీడి విద్యార్థుల



న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విద్యార్థుల ఉద్యమానికి సంఘీభావం ప్రకటించారు.

## విద్యార్థుల్లో పచ్చదనంపై చైతన్యం

### ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఘనంగా వనమహోత్సవం



**అందోల్, (ప్రజాజ్యోతి):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశంతో ఆందోల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శనివారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎమిమా మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి సంరక్షించడమే నిజమైన వనమహోత్సవమని సూచించారు. కార్యక్రమంలో బీఎస్సీ నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరితంగా సాగింది.




## 30 నిమిషాల్లోనే 560 బస్తాల యూరియా బుకింగ్.. రైతుల్లో అయోమయం



**కల్హే ర్ , జూలై 25. ప్రజా జ్యోతి** వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో యూరియా కోసం రైతుల నుంచి భారీగా డిమాండ్ నెలకొంది. బీబీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో యూరియా విక్రయాల కోసం అధికారులు ప్రారంభించిన ఆన్‌లైన్ బుకింగ్ పోర్టల్‌కు అనూహ్య స్పందన లభించింది. పోర్టల్ ప్రారంభించిన కేవలం 30 నిమిషాల్లోనే 560 బస్తాల యూరియా పూర్తిగా బుక్ అయింది. దీంతో ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోలేకపోయిన పలువురు రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు. తమకు యూరియా అందుతుందో లేదోనన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగు పనుల కీలక సమయంలో ఎరువుల కొరత తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, యూరియా నిల్వలను పెంచి అందరికీ అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందిస్తూ, అందుబాటులో ఉన్న నిల్వల మేరకే బుకింగ్‌లు చేపట్టినట్లు తెలిపారు. అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని అదనపు యూరియా నిల్వలను సమీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దగ్గర్లోని. కృష్ణాపూర్. కల్హే ర్.మహాదేవపల్లి రైతు కేంద్రాలలో యూరియా లభ్యంగా ఉందని వ్యవసాయ అధికారి వెంకటేశం తెలిపారు. .రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి విడతలో కూడా యూరియా సరఫరా కొనసాగుతుందని.వెల్లడించారు.

## సిద్ధార్థ హైస్కూల్ లో అత్యంత వైభవంగా బోనాల పండుగ వేడుకలు

### విద్యార్థుల నృత్యాలు మరియు సాంస్కృతిక ప్రదర్శనలు విశేషం




**జహీరాబాద్, జూలై 25(ప్రజా జ్యోతి న్యూస్)** పట్టణ కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్ లో శనివారం తెలంగాణ సంస్కృతి సంప్రదాయా లకు ప్రతీక అయిన బోనాల పండుగ వేడుక లను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థినులు సాంప్రదాయ వస్త్రధారణతో నెత్తిన బోనాలను ఎత్తుకుని పాఠశాల ఆవరణలో ఊరేగింపుగా వచ్చి భక్తిభావంతో పూజలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు మరియు తీన్మార్ డప్పు చప్పుళ్లకు అనుగుణంగా విద్యార్థులు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ బోనాల సంబరాలలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మోహన్ రెడ్డి మరియు ప్రిన్సిపాల్ కే శేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మోహన్ రెడ్డి మరియు ప్రిన్సిపాల్ కే శేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాబోధనతో పాటు విద్యార్థులకు మన ప్రాంతీయ పండుగలు సంస్కృతి సంప్రదాయాల పై చిన్నతనం నుండే అవగాహన కల్పించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతగానో దోహదపడతా యని అన్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా విద్యార్థులంతా ఎంతో క్రమశిక్షణతో మరియు ఉత్సాహంగా ఈ వేడుకలలో పాల్గొనడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ ఘనమైన బోనాల సంబరాల కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## ఉద్యోగాలు ఊడుతాయంటే ఏఐ విజయం ఎవరికి కావాలి : సత్య నాదెళ్ల

కృత్రిమ మేధపై ప్రజల్లో నమ్మకం తగ్గిపోవడానికి ప్రధాన కారణం ఉద్యోగాలు పోతాయనే భయమేనని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యనాదెళ్ల అన్నారు. ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఆయన.. ఏఐవల్ల నాలెడ్జ్ ఆధారిత ఉద్యోగాలన్నీ పోతాయని ఒకవైపు చెబుతారని, మరోవైపు అదే టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నామని గర్వంగా ప్రకటిస్తున్నారని అన్నారు. ఉద్యోగాలే పోతాయంటే ఏఐ విజయాన్ని ఎవరు కోరుకుంటారని ప్రశ్నించారు. ఏఐ రంగం గురించి మాట్లాడుతున్న తీరువల్లే ప్రజల విశ్వాసం దెబ్బతిన్నదని నాదెళ్ల అభిప్రాయపడ్డారు. ఉద్యోగాలు కోల్పోతామనే ఆందోళన ప్రజల్లో బలపడిందని, అందుకే ఏఐపై అనుమానాలు పెరుగుతున్నాయని చెప్పారు. కాలేజీల్లో ఏఐ గురించి మాట్లాడితే వ్యతిరేక స్పందన రావడం కూడా ఈ పరిస్థితికి నిదర్శనమన్నారు. ప్రజల విశ్వాసాన్ని తిరిగి పొందాలంటే ఏఐవల్ల సమాజానికి ప్రత్యక్ష ప్రయోజనాలు కనిపించాల్సిన అవసరం ఉందని నాదెళ్ల సూచించారు. ఉదాహరణకు డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తే స్థానిక ఉపాధి, పన్ను ఆదాయం, పాఠశాలలు, మౌలిక వసతుల వంటి రంగాలకు ఎలా మేలు జరుగుతుందో ప్రజలకు స్పష్టంగా